# ముందు చూపు

## – బద్దిగం పాండురంగారెడ్డి

''మే ఐ కమిన్ సర్?''

''ఎస్!'' అప్రయత్నంగా అని డోర్ తెరుచుకుని లోపలకు వస్తున్న అనిలవైపు ప్రశ్నార్థకంగా చూసాడు శివరాం.

అనిల ఆ ఆఫీసులో స్టెనోగా పని చేస్తోంది. శివరాం ఆ ఆఫీసులో ఒక విభాగానికి అధికారి. డిక్టేషన్ తీసుకుందుకు రోజుకు కనీసం ఏడెనిమిదిసార్లు అతని ఛాంబర్‌లోకి వస్తుందామె.

అనిలకు పెళ్లయింది. ఆమె భర్త వేరే కంపెనీలో ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. వారికి ఇద్దరం సంతానం. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తేతప్ప ఆ కుటుంబానికి భవిష్యత్తుండదు. కనుక ఆమెకీ ఉద్యోగం తప్పనిసరి.

తను కబురు పెట్టకుండా తన ఛాంబర్‌లోకి తనంత తానుగా ఎప్పుడూ రాదు అనిల. అదే విషయం ఆలోచిస్తున్నాడు శివరాం ఆమె తన టేబుల్ దగ్గరకు వచ్చేవరకూ.

దగ్గరకు వచ్చాక చేయి చూపించాడు కూర్చోమన్నట్లుగా. ఆమె కూర్చోగానే ''ఎస్'' అన్నాడు మళ్లీ.

అనిల కాసేపు తటపటాయించింది. చివరకు తల ఓసారి అటూ ఇటూ ఆడించి ''రంగారావు ప్రవర్తన ఏమీ బావుండలేదు సార్'' అంది.

రంగారావు అదే ఆఫీసులో క్లర్క్. అనిల పక్క సీటు అతనిది.

''చీటికీ మాటికీ నా దగ్గరకు వచ్చి ఏవో సూటిపోటీ మాటలంటుంటాడు. ఇన్నాళ్ళనుంచీ ఎలాగో సరిపెట్టుకున్నాను. కానీ ఈరోజు ఓ పది నిముషాల క్రితం నేను అల్మైరాలోంచి ఫైల్స్ తీస్తుంటే నా వెనుకగా వచ్చి నన్ను తాకుతూ నా వెనుక నిలబడి ఏదో పని వున్నవాడిలా తనూ అల్మైరాలో వెతుకుతున్నాడు సార్. ఇన్నాళ్ళూ నాకు దూరంగావుండి మాటలతో నన్ను టీజ్ చేసేవాడు. ఈ రోజతని ధోరణి శృతిమించడంతో మీతో చెప్పక తప్పదనిపించి చెబుతున్నాను.''

శివరాం మొహంలో రంగులు మారాయి. అనిల ఇంకా ఏదో చెప్పేలోగా–

''ఆ విషయం నేను చూసుకుంటాను. ఇహముందిటువంటివి జరక్కుండా చూస్తాను'' అంటూ తన దృష్టిని అనిల మీదనుంచి మరల్చి టేబుల్‌మీదున్న ఫైల్ అందుకున్నాడు.

అనిల లేచి నిలబడింది.

ఆమె వెళ్లిన తరువాత దీర్ఘంగా ఆలోచించాడు శివరాం. రంగారావును పిలిచి అడిగితే ''నాకా ఉద్దేశ్యం లేదు సార్'' అనొచ్చు. తనకు సంబంధించిన ఫైల్స్ కూడా అదే అల్మైరాలో వున్నందువల్ల తనూ అదే సమయానికి వెదకడం కాకతాళీయమని నమ్మించేందుకు ప్రయత్నించొచ్చు. ఒకవేళ ఆ సమయంలో తన కాలో, చేయో ఆమెకు తగిలైతే తగిలుండవచ్చునని, అది ప్రయత్నపూర్వకంగా చేసిందెంతమాత్రమూ కాదని తనను తాను డిఫెండ్ చేసుకునే ప్రయత్నం చేసినా ఆశ్చర్యపడనక్కర్లేదు.



కనుక అతన్ని పిలిచి ఆ విషయం అడగడంవల్ల ప్రయోజనం వుండదు. రంగారావు సీటు అనిల పక్కనుంచి మార్చవచ్చును. కానీ ఆ ఆఫీసులో అనిల ఒక్కర్తే ఆడది. ఒకవేళ ఎవరైనా కొంతకాలంపాటు ఆమెతో బాగానే వున్నా అది శాశ్వతం కాబోదు. నీతి శతకాలూ, వావివరుసలూ, వయోభేదాలూ ఎన్నడో మరచిపోయిన కాలం ఇది. మూడో పద్ధతి...ఏదో ఆలోచిస్తూ ఉలిక్కిపడ్డాడు శివరాం.

అనిల ఆ ఆఫీసులో గత మూడేళ్ళుగా పని చేస్తోంది. తనీ ఆఫీసుకువచ్చి ఆరునెలలైనా కాలేదు. ఈ మధ్యకాలంలో అనిలతో తన ప్రవర్తన సింహావలోకనం చేసుకుంటే...కనీసం వారానికోసారి తన కాలో, వేలో ఆమెకు తగలని సందర్భంలేదు.

అలా జరిగిన సందర్భాల్లో తను కల్పించుకుని అలా జరిగేలా చేయడమే చాలావరకూ కారణమన్న నిజం తనకు తెలుసు. అందుకే అందమైన అనిల మొహం పదేపదే చూడాలనిపించినప్పుడు అవసరమున్నా, లేకపోయినా తన ఛాంబర్‌కు రప్పించి తను డిక్టేట్ చేసిన లెటర్స్‌లో అవసరంలేని చిన్న చిన్న కరెక్షన్స్ చేసేవాడు.

పదేపదే అనిలను తన ఛాంబర్‌లోకి రప్పించుకోనడంకంటే ఆమె సీటునే తన ఛాంబర్‌లోకి మార్పించుకుంటే అద్భుతంగా వుంటుందనే ఆలోచన తనకు నెలరోజుల క్రితమే వచ్చింది. కానీ ఇప్పుడు తనా పని చేస్తే రంగారావు హీరో అయిపోతాడు.

తన మీద గాసిప్స్ బయలుదేరుతాయి. ఈ రోజు రంగారావు గురించి తన దగ్గర రిపోర్ట్ చేసిన అనిల భవిష్యత్తులో తన మీద కూడా తనపై అధికారితో ఫిర్యాదుచేసే అవకాశముంది.

సో...నన్ను నేనే సరిదిద్దుకోవాలి ముందుగా. ఈ ప్రాబ్లమ్ సాల్వ్‌చేసే విషయం ఆ తరువాత చూడొచ్చు. ఓ నిర్ణయానికి వచ్చి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు శివరాం.

నెలరోజుల తరువాత రంగారావును తనింటికి పిలిచి పార్టీ ఇచ్చింది అనిల. తన బాస్ శివరాంకు ఇటీవల పెరిగిన పైత్యాన్నామె గ్రహించి దానికి విరుగుడుగా రంగారావుమీద ఫిర్యాదు చేయడంద్వారా తన ప్రవర్తనలోని ఔచిత్యాన్ని గురించి ఆలోచించుకునే అవకాశాన్ని అతనికి కలిగించింది.

తను అలా ఫిర్యాదు చేయడంవల్ల తనూహించినట్లుగా శివరాం ఆత్మపరిశీలన చేసుకోకుండా రంగారావును పిలిచి మందలిస్తే దానికి రంగారావు బాధపడకుండా తన ప్లాన్ ఏమిటో అతనికి ముందుగానే చెప్పిందామె.

కానీ శివరాం తెలివైనవాడు కావడాన అనిల ఊహించినట్టుగానే తనలో తాను తర్కించుకుని మౌనంగా ఊరుకోవడమే కాకుండా మర్నాటి నుంచీ అనిలను అవసరమైతే తప్ప తన ఛాంబర్‌లోకి రప్పించడం మానేశాడు.

రంగారావుమీద తను యాక్షన్ తీసుకోకపోయినా ఆ విషయమై అనిల తిరిగి తననెన్నడూ అడగకపోవడం మాత్రం శివరామ్‌కెన్నటికీ అర్థంకాని విషయంగానే మిగిలిపోయింది.

★